

# రమణ భాస్కర

ఆధ్యాత్మిక పక్షపత్రిక

20-7-2001 (15)



## శ్రీ రమణ క్షేత్రం - జిన్నూరు

పశ్చిమ గోదావరి జిల్లా - ఆంధ్రప్రదేశ్. పిన్ : 534 265

# సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహ భాషణములు

| | | |
|---|---|---|
| 26-07-2001 | అరుణాచలం నుండి జిన్నూరు రాక | |
| 30-07-2001 | మహేంద్రవాడ | సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయప్రాంగణంలో రూట్: మండపేట, రామచంద్రపురం కెనాల్ రోడ్‌లో పెడపర్తి రేవు నుండి ఎడమవైపుకు వయా కుతుకులూరు, పాలమూరు |
| 31-07-2001 | పాలకొల్లు | శ్రీ పెన్మెత్స సత్యనారాయణ రాజు, సూర్యపద్మావతి క్షత్రియ సంక్షేమ పరిషత్ కళ్యాణ మండపం |
| 03-08-2001 To 10-08-2001 | హైదరాబాద్ కేంపు | |
| 23-08-2001 | గెద్దనపల్లి | వయా అమలాపురం, మహపాల్ చెరువు, తూ.గో.జిల్లా |
| 30-08-2001 | కోలమూరు | వయా ఉండి |
| 17-09-2001 | బలుసుపాడు | గురుధామ్ ఆశ్రమం, జగ్గయ్యపేట దగ్గర, కృష్ణా జిల్లా |
| 23-09-2001 | జిన్నూరు | సద్గురు శ్రీ నాన్నగారి పుట్టిన రోజు, శ్రీ రమణ క్షేత్రం |



మద్రాసు వాస్తవ్యులు శ్రీ వడివేలు గారు అరుణాచలంలో శ్రీ నాన్నగారి ఆశ్రమం ప్రక్కన నిర్మించిన భవన గృహప్రవేశము ది.12-7-2001 ఉదయం గం.7-52 ని॥లకు సద్గురు శ్రీ నాన్నగారిచే జరుపబడినది



పాలకొల్లు కాస్మో కల్చరల్, స్పోర్ట్సు కాంపెక్స్‌కు సద్గురు శ్రీ నాన్నగారిచే బహుకరింపబడిన జిమ్ పరికరముల రూమ్‌ను ది. 8-7-01 ఆదివారం ఉదయం గం॥ 11-30 ని॥లకు దాదా ఫాల్కే అవార్డు గ్రహీత డా॥ అక్కినేని నాగేశ్వరరావుగారు ప్రారంభించినారు.




ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర

సంపుటి : 6 సంచిక : 15 పుష్పం : 45-47 20-07-2001





**RAMANA BHASKARA**

**TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE**

PAGES : 12

**VOL : 6 ISSUE : 15**

EDITOR
**P.S. RAMA RAJU**

EDITING
**P.H.V. SATYAVATHI**
(HYMA)

**SUBSCRIPTION**
Yearly : **Rs. 140/-**
Each Copy : **Rs. 10/-**

**ADDRESS**
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETRAM
**JINNURU - 534 265**
W.G.Dt., A.P.

**PUBLISHER**
P.S. RAMARAJU
LAKSHMI MODERN RICE MILL
**ULLAMPARRU - PALAKOL**
☎ 08814 - 24589, 24689

**PRINTER**
SHRIRAM GRAPHICS
BANK STREET - **PALAKOL**
☎ 08814 - 22438, 24278


## ఎవరిని వారే ఉద్ధరించుకోవాలి

మన ప్రస్తుత మానసికస్థితి అశాంతిగా ఉంది. దానికికారణం కుటుంబమని, సమాజమని, ఆర్థిక పరిస్థితులని, నిరుద్యోగంఅని, పేదరికంఅని అనిపిస్తూ ఉంటుంది. వాటిని నిశితంగా మనం పరిశీలించినపుడే ఆ సమస్యలమీద మనకు పూర్తి అవగాహన వస్తుంది. మనల్ని మనం పాడుచేసుకొనేశక్తి, మనల్ని మనం బాగుచేసుకొనేశక్తి రెండూ మనలోనే ఉన్నాయి. మనస్సు చెడువాసనల పట్టులో ఉన్నప్పుడు, మనల్ని పాడుచేసేశక్తి అనగా అన్నీ నావల్లే జరుగుతున్నాయి అని మనమీద ఆరోపించుకొనే (Wrong Assumption) శక్తి వృద్ధి అవుతుంది. దీనివల్ల మనకు అనేక చెడులు ఎదురవుతాయి. ఉపాధిచేసే కర్మను తనమీద ఆరోపించుకొనే శక్తినే అహంభావం అంటారు. ఇది బంధహేతువు. ముక్తిహేతువుకూడా మనలోనే ఉంది. అహంభావాన్ని గుర్తించి, దానిద్వారా జరిగే క్రియలను, ఎఱుకతో (Awareness) పరిశీలించినపుడు, అట్టి అహంభావం ఉపశమించి, మనస్సు సంస్కరింపబడి, మనస్సు ఆరోగ్యముగా పనిచేస్తుంది. అప్పుడు ఇతరులతో మనకున్న సంబంధం ప్రేమతో నిండి మనం ఉద్ధరింపబడతాము. అహంభావం బంధహేతువు, ఎఱుక (Awareness) ముక్తిహేతువు ఎవరిని వారు ఉద్ధరించుకోవాలని శ్రద్ధగా సాధన చేసినప్పుడు, అనుగ్రహం క్రియాత్మకంగా (Active) ఉంటుంది. సాధన చేయకపోతే అనుగ్రహం నిద్రానంగా (Dorment) ఉంటుంది.

సంఘాన్ని, కులాన్ని, మతాన్ని, భక్తులను ఉద్ధరిస్తాం అనేవారు, వారి స్వార్థప్రయోజనాలు నెరవేర్చుకోవటం కోసం వీటిని ఉపయోగించుకుంటారు. సేవ ముసుగులో వారి స్వార్థప్రయోజనాలను నెరవేర్చుకుంటారు. వీరిపట్ల మానవజాతి జాగ్రత్తగా వుండాలి.

- Dr. P.V.S. సూర్యనారాయణ రాజు

ఈ సంచికలో...... సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు


12-02-2001 పెదపుల్లేరు ........................ 2
13-04-2001 భీమవరం ........................ 6
31-05-2001 జిన్నూరు ........................ 9

# సృష్టిలో దోషంలేదు, నీ దృష్టిలోనే దోషం ఉంది

(సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 12-2-2001, పెదపుల్లేరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

నీ హృదయంలో ఒక నిజం ఉంది. ఆనిజం ఎవరు అంటే అది నీస్వరూపమే, అది నీకు వేరుగాలేదు. ఆ స్వరూపంతో అనుసంధానం కలిగి ఉండటమే భక్తి అని ఆచార్యులవారు చెప్పారు. అయితే అది అందరికి సాధ్యంకాదు. మనం నామరూపములతో తాదాప్యం పొందుతాము. నామంతోటి, రూపంతోటి తాదాప్యం ఉన్నవారికి నిరాకారాన్ని ఆరాధించటం కష్టం. కొంతమంది భగవంతుడిని తల్లిగా ఆరాధిస్తారు, కొంతమంది కుమారుడుగా ఆరాధిస్తారు కాని వీటి అన్నింటికి ఈ నామరూపాలకు, ఈ సృష్టికి అంతా ఆధారముగా ఉన్నది నీ లోపలవున్న చైతన్యమే. మీరు ఏ దేవతను ఆరాధించినా ఆ చైతన్యాన్నే పట్టుకోండి. హృదయంలో ఉన్నవాడిని పట్టుకొంటే వాడే మనలను చెయ్యిపట్టుకొని అక్కడకు లాగుతాడు. ఎవడైతే చైతన్యానుభవం పొందాడో వాడిద్వారా ఆనందం, శాంతి, కాంతి జీవకోటికి అందుతుంది. ఈ సృష్టిలో దోషంలేదు, దోషంఅంతా నీ అహంకారంలోనే ఉంది. దానిని మినహాయించి వాడిని బాగుచేస్తాను, వీడిని బాగుచేస్తాను అంటావు. ప్రజాసేవ చేస్తూఉంటే నీ అహంకారం అణగాలి. నీవుచేసే ప్రజాసేవ వలన అహంకారం పెరుగుతూఉంటే దానివలన పుణ్యంవస్తే రావచ్చు అది అనుభవిస్తే పోతుంది చివరకు మోక్షం సున్న.

నేను అనే మూలతలంపే నీకు లోకంగా మారుతోంది, దేహంగా, ఇంద్రియాలుగా మారుతోంది, రాగద్వేషములుగా మారుతోంది. ఇవిఅన్నీ ఆ మూలతలంపు కల్పించినవే. వాడే సైతాను. ఆ మూలతలంపును తీసి ఒక ప్రక్కనపెట్టాలి. బాహ్యంగా మీరు ఎంత అభివృద్ధిచెందినా అంటే ఆర్థికంగాగాని, రాజకీయంగాగాని, సాంఘికంగాగాని మీరు ఎంత ఎత్తు ఎదిగినా ఎవరి బాధలు వారు మోయవలసిందే కాని ఎవడైతే ఈ మూలతలంపును తీసి ఒకప్రక్కన పెట్టాడో వాడి బరువును వాడు మోయనక్కరలేదు, వాడి బరువును ఈశ్వరుడు మోస్తాడు. ఆ మూలతలంపు బంగారం కాకపోయినా మనకు బంగారంలాగ కనిపిస్తోంది. అందువలన దానిని తీసి ఒకప్రక్కన పెట్టలేము. నీ ప్రవర్తన నిర్మలంగా లేకపోతే నీకు అభ్యాసం, వైరాగ్యం లేకపోతే ఆ మూలతలంపును తీసి ఒకపక్కన పెట్టలేవు. ఎవడికైతే వైరాగ్యం ఉందో, ఎవడికైతే విచక్షణ ఉందో, ఎవడికైతే వివేకం ఉందో వాడే ఈ మూలతలంపును తీసి ఒకప్రక్కన

పెట్టగలడు. ఆ మూలతలంపును తీసి ఒకప్రక్కన పెట్టిన మరుక్షణంనుంచి నీకు ఎంత బరువుఉన్నా ఆ బరువును ఈశ్వరుడు మోస్తాడు. ఆ మూలతలంపును ప్రక్కన పెట్టనంతకాలం ఈ జన్మలోనేకాదు, కోటిజన్మలలోకూడా ఆ బరువును నీవు మోయవలసిందే. మూలతలంపు అనేది నీ సొంత సమస్య. ఎవరోవచ్చి తొలగించేదికాదు. ఎవరంతట వారు కృషిచేసి తొలగించుకోవాలి. మూలతలంపును తొలగించుకోవటానికి నీవు ప్రయత్నం చేస్తూఉంటే ఈశ్వరానుగ్రహం కలుగుతుంది అప్పుడు దానిలోనుండి బయటకు వస్తావు. నీ స్వభావాన్ని మార్చుకోవటం చాలాకష్టం. నిప్పమీద చెయ్యివేస్తే మంట అంటే నొప్పి ఎంత తీవ్రంగా ఉంటుందో నీ స్వభావాన్ని మార్చుకోవటానికి ప్రయత్నం చేసేటప్పడు అంతమంట రావచ్చు కాని దానిని నీవు తట్టుకోగలగాలి. దానిని తట్టుకోవాలంటే నీకు అర్హత, యోగ్యత ఉండాలి. సత్కర్మచేసి ఉండాలి, పూర్వజన్మ పుణ్యబలం ఉండాలి. అంత ఫౌండేషన్ ఉంటేగాని దానిని నీవు తట్టుకోలేవు.

దేహానికి మరణం వచ్చినప్పడు నేను మరణిస్తున్నాను అనుకొంటున్నావు. ఎందుచేతనంటే దేహమే నువ్వు అనుకొంటున్నావు. దేహము నేను అనే భావన కనుక పోతే, దేహబుద్ధి నశిస్తే శరీరం ఉండగానే నువ్వు మరణాన్ని జయిస్తావు, జీవన్ముక్తుడవు అవుతావు, పునర్జన్మలేని స్థితిని పొందుతావు. నీ హృదయంలోఉన్న చైతన్యానికి, సద్వస్తువుకు నామంలేదు, రూపంలేదు. దానికి నామాలు, రూపాలు కల్పించుకొంటున్నాము. రూపాలతోటి, నామాలతోటి సంబంధం లేకుండా నువ్వు నిశ్చలంగా, నిర్మలంగా ఉండగలిగితే ఉదాత్తమైన స్థితిని, మోక్షస్థితిని ఈ జన్మలోనే ఇప్పడే ఇక్కడే అందుకొంటావు. నీకు తెలిసినా తెలియకపోయినా నీవు ఆత్మవే, నీవు చైతన్యమే మరి సాధన ఎందుకు? నువ్వు ఆత్మవే అన్న సంగతి నీకు తెలియటంలేదు. ఎవరి వలన తెలియటంలేదో ఏ విషయాలవలన తెలియటంలేదో అది తెలుసుకొని వాటిని బయటకు నెట్టటానికే సాధన. నువ్వు సత్పురుషులతో సహవాసంచెయ్యి, ధ్యానంచెయ్యి, విచారణచెయ్యి, భగవంతుడిని ప్రేమించు. నువ్వు ఏ ప్రయత్నంచేసినా అందులో మూలతలంపును ఇన్వాల్వ్‌చెయ్యి, అంతేగాని మూలతలంపును మినహాయించవద్దు. నీవుచేసే పని ఇష్టంగాచెయ్యి, ఇష్టం ఉన్నచోట కష్టం అనిపించదు. పూర్వజన్మ సంస్కారమునుబట్టి మనిషికి వృత్తి వస్తుంది. నీవృత్తి ద్వారా కూడా భగవంతుడిని ఆరాధించు. ఈ నామరూపములలో భగవంతుడు ఉన్నాడని మర్చిపోవద్దు. నీవుచేసే పనిని ఇష్టంగాచెయ్యి. ఇష్టంగాచేస్తే పాతవాసనలుపోతాయి, కొత్తవాసనలురావు. నువ్వు చేసేపనిని ఇష్టంగా చేయవు

అనుకో పాతవాసనలు అలాగే ఉంటాయి, కొత్తవాసనలువచ్చి వాటికి కలుస్తాయి. పనిలో నువ్వుచిరాకుగా, విసుగుగా ఉండవద్దు. పనిలోకూడా దేవుడినిచూడు. నీకు భౌతికంగా ఎన్ని ఉన్నప్పటికి నిరాడంబరంగా జీవించకపోతే నీకు అర్హతరాదు, యోగ్యతరాదు, ఔన్నత్యంరాదు అంటున్నారు భగవాన్. నిరాడంబర జీవితంవలన ఆధ్యాత్మికంగా ఔన్నత్యంవస్తుంది, నువ్వు బుద్ధిమంతుడవు అవుతావు, నీకు మంచితనం వస్తుంది. మంచితనం భగవదనుభవం పొందటానికి దారిచూపిస్తుంది. మంచితనం వలన సత్వగుణం పెరుగుతుంది.

చేతులతో పూజచెయ్యి, నోటితో జపంచెయ్యి, మనస్సుతో ధ్యానంచెయ్యి ఇవిఅన్నీ చేయగాచేయగా నీకు యోగ్యత కలిగింది అనుకో అప్పుడు ఈ ధ్యానం చేసేవాడు ఎవడు, ఈ పూజచేసేవాడు ఎవడు అని లోపలకు చూసుకొంటూఉండు. అలా లోపల వెతుకుతూఉంటే ఫలానావాడు చేస్తున్నాడు అని నీకు తెలుస్తుంది. అప్పుడు వాడిని నెమ్మది నెమ్మదిగా లోపలకు తొలుకొనివెళ్ళండి. వాడు ఎక్కడనుండి ఉదయించి వస్తున్నాడో అక్కడకు నెట్టుకొనివెళ్ళండి ఈ రాగద్వేషములు, ఆలోచనలు, కష్టాలు, సుఖాలు అన్నీ ఎవరికి వస్తున్నాయి అని చూసుకోండి. ఇవి అన్నీ దొంగ నేనుకే వస్తున్నాయి. ఈ దొంగనేను ఎవడు అని వాడిని ప్రశ్నించండి, వాడిని బోను ఎక్కించండి. వాడిని విచారణచేస్తే వాడు లోపలకు వెళతాడు. జ్ఞానం కావాలంటే పైకివెడితేరాదు, లోపలకువెళ్ళేవాడికి జ్ఞానం కలుగుతుంది. నువ్వుకాని వస్తువులతో తాదాప్యం పొందుతూఉంటే నీవు పైకివెడతావు, కాని వస్తువులతో తాదాప్యం తగ్గించుకొంటే లోపలకు వెడతావు. మూలతలంపు అనేక విషయాలను కల్పిస్తుంది. మూలతలంపు ఎంతనిజమో అది కల్పించిన విషయాలుకూడా అంతేనిజం. మూలతలంపు కల్పించిన విషయాలను మీరుపట్టుకోవద్దు. మూలతలంపును పట్టుకొని దానిమూలంలోనికి పంపటానికి ప్రయత్నం చేయండి. అది నీకు కుదరకపోతే భగవంతుని పాదాలను ఆశ్రయించు. భగవంతుని పాదాలను అర్చించగా, అర్చించగా నీకు ఉపయోగంలేని తలంపులు అన్నీ బయటకుపోతాయి. అవిపోయిన తరువాత నీవు పవిత్రుడవు అవుతావు. నీ శరీరానికి స్నానం ఎటువంటిదో నీ మనస్సు పవిత్రం అవ్వటానికి ఈశ్వరుని ప్రార్థన అటువంటిది.

ఎవడైతే అనేక జన్మలు సాధనచేసి పరమపవిత్రుడు అయ్యాడో, ఈశ్వరానుగ్రహం వలన వాడిలోఉన్న దోషములు పోయాయో అప్పుడు వాడి హృదయంలోఉన్న ఆనంద సముద్రం పొంగి సహస్రారాన్ని ముంచుతుంది. అప్పుడు శాంతే శాంతి, ఆనందమే ఆనందం, సుఖమే సుఖము. ఆ సుఖానుభవంలో నీ శరీరంపడిపోయినా శరీరం పోయింది, నేను

చనిపోతున్నాము అనికూడా నీకు తెలియదు ఎందుచేతనంటే చావులేని వస్తువుతో తాదాప్యం పొందిఉంటావు. మనలోఉన్న దోషాలుఅన్నీ పోతే అప్పుడు మన నిజమైన ఇంటికి వెళ్ళిపోతాము. అదే హృదయగుహ. గుహలోఉన్న ఈశ్వరుడు మనకు అనుభవంలోనికి వచ్చినప్పడు వాడి స్వరూపమే సుఖము, శాంతి, ఆనందం కాబట్టి ఆ సుఖం, శాంతి నీకు అందుతాయి. సృష్టిలో దోషంలేదు, నీ దృష్టిలోనే దోషంఉంది. మూలతలంపులోనే దోషం ఉంది, వేరుభావన అక్కడేఉంది. పనిచేయటం నీచేతిలోఉంది, ఫలంనీ చేతిలోలేదు. ఫలం నీచేతిలోలేదు అని పనిచేయటం మానవద్దు. ఫలం ఈశ్వరుడు ఇస్తాడు, ఆయన దగ్గర పెట్టుకోడు ఏదో జన్మలో ఆ ఫలం నీకే ఇచ్చేస్తాడు. మీరు శాంతిగా ఉండాలంటే ఫలంమీద ఆసక్తి పెట్టుకోవద్దు. ఆసక్తిలేకుండా పనిచేయండి మీకు అమృతత్వం కలుగుతుంది. పనివలన దుఃఖంరాదు, ఆసక్తి పెట్టుకోవటం వలన దుఃఖం వస్తుంది. దోషంఅంతా ఒకేచోట ఉంది. అది అహంభావన రూపంలోఉంది. అహంభావనను మాయచేయండి, దానిని మాయచేస్తే మీరు పోతారని అనుకోవద్దు, మీరు ఎలా ఉన్నారో అలా మిగులుతారు. కోట్లాదిజన్మలు ఎత్తుతొంటూ వస్తున్నాముకదా ఒక్కసారి అహంభావనపోయి ఆత్మానుభవం కలిగిందిఅనుకో ఈ కోట్లాది జన్మలు అన్నీకూడా స్వప్నమాత్రం అన్న సంగతి మీకు అనుభవంలోనికి వస్తుంది.

# నిరాడంబర జీవితం వలన ఆధ్యాత్మికంగా ఔన్నత్యం కలుగుతుంది

# నీవు ఏదైతేకాదో దానిలోనుండి విడుదలపొందటానికి విచారణ అవసరం

(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు, భీమవరం 13-4-2001)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

సత్యాన్వేషణ లేనివాడికి సత్యం ఎరుకపడదు. మనం సత్యాన్ని అన్వేషిస్తున్నామా లేదా అనేది సత్యం చూసుకొంటూ ఉంటుంది. సత్యం అంటే చైతన్యం, అది జడవస్తువు కాదు. కేవలం సత్యం తప్పించి నాకు ఏదీ అవసరం లేదు అని ఎవడైతే సత్యం కోసం జీవిస్తున్నాడో వాడికి సత్యం తెలియబడుతుంది. నీవుసత్యాన్ని తెలుసుకొనే తీరాలి ఇందులో రాజీలేదు ఎందుచేతనంటే సత్యాన్ని తెలుసుకొనే వరకు నీకు స్వేచ్ఛలేదు. అయితే సత్యం ఎక్కడ ఉంది? అది ఎక్కడో లేదు నీహృదయంలోనే ఉంది, అది నీవుగా ఉన్నావు కాని దాని తాలుక అనుభవం నీకులేదు. అది నీ హదయంలోనే ఉంది అనికూడా నీకు తెలియటంలేదు. ఉందని తెలిస్తే దానికోసం ప్రయత్నం చేస్తావు. ప్రయత్నం ఎప్పుడైతే మొదలుపెట్టావో ఈశ్వరానుగ్రహం వస్తుంది. స్వప్రయత్నం, కాలపరిపక్వం, ఈశ్వరకటాక్షం ఇవి మూడూ మనం గుర్తుపెట్టుకోవాలి. సత్యం మన హృదయంలోనే ఉంది అనే దృఢనిశ్చయం ముందు మనకు ఉండాలి. తల్లిగర్భంలోనుండి వచ్చినది మొదలు స్మశానంకు వెళ్ళేవరకు ఎవరి జీవితంకూడా యూనిఫారమ్‌గా వెళ్ళదు, ఎన్నో హెచ్చుతగ్గులు ఉంటాయి, వాటిని మనం భరించాలి. మనందరం చేస్తున్న పొరపాటు ఏమిటి అంటే మనస్సుతో ఎన్నో విషయాలు నేర్చుకొంటాము కాని మనస్సును ఎడ్యుకేట్ చేయటం లేదు. ముందు మన మనస్సుకు ట్రైనింగ్ ఇవ్వాలి. సత్యం అనేది సూక్ష్మాతి సూక్ష్మంగా ఉంటుంది. దానిని గ్రహించటానికి బుద్ధి సూక్ష్మత ఉండాలి. సూక్ష్మ విషయాలు గ్రహించటానికి తగినంత ట్రైనింగ్ అవసరం. సత్యాన్వేషకుడు ఎలా ఉండాలంటే ఈ శరీరం ఏదోరోజు మరణిస్తుంది, ఈ శరీరం మరణించకముందే శరీరం ఉండగానే మనం ఎలా మరణించాలో నేర్చుకొంటే వాడికి సత్యసాక్షాత్కారం కలుగుతుంది. సత్యం నీకు అనుభవంలోనికి వచ్చింది అనుకో ఈ శరీరంఉన్నా ఇబ్బంది లేదు, శరీరం పోయినా ఇబ్బందిలేదు. శరీరం మరణించిన తరువాతకూడా మనం ఉంటాముకాని ఉండము అనే తలంపు వలన మనకు భయం కలుగుతుంది. నేను చనిపోతున్నాను అంటే అక్కడ శరీరమే నీకు నేనుగా వ్యక్తమవుతోంది. అది మిధ్యానేను. దానిని మనం విడిచిపెట్టాలి. విడిచిపెట్టవలసినది విడిచిపెడితే పట్టుకోవలసింది నీచేతికి అందుతుంది.

గ్రంధాలు చదవటంకంటే జీవితంలోవచ్చే సంఘటనలద్వారా మనం పాఠాలు నేర్చుకోవాలి. మనకు అంతర్దృష్టి ఉంటే జీవితంలోవచ్చే సంఘటనలు మనలను ఎడ్యుకేట్ చేస్తాయి. యదార్థం చెప్పాలంటే మనం ఎన్ని శాస్త్రాలు చదివినా, ఎన్ని డిగ్రీలు సంపాదించినా మనస్సుకు లోచూపు లేకపోతే, మనస్సు హృదయాభిముఖంగా ప్రయాణం చేయకపోతే అసలు నిజమైన విద్య ప్రారంభం అవ్వదు. సత్యం అనేది మనస్సుతో గ్రహించేదికాదు. మనస్సు ఎక్కడైతే అణిగిందో, మనస్సు ఎక్కడైతే నశించిందో అక్కడ సత్యం నీకు అనుభవంలోనికి వస్తుంది. మనస్సుకు అంతర్దృష్టి కలగాలి. మనస్సుకు అంతర్దృష్టి కలగటం కోసమే సజ్జన సాంగత్యం, సత్కర్మ, ఈ ప్రవచనాలు. పూర్వజన్మలో సత్కర్మ చేసినవారికి కోపం, అసూయ, రాగద్వేషములు తక్కువగా ఉంటాయి. పూర్వజన్మలో సత్కర్మ చేయనివాడు ప్రతీ చిన్నవిషయానికి ఉద్రేకపడతాడు. నీ మనస్సుకు చిన్నమాటను భరించేశక్తి లేనప్పుడు ఇంక అది లోపలకు ఎలా వెడుతుంది. మనం దేహానికి కంఫర్టు చూసుకొంటాముగాని మనస్సు కంట్రోలు చూసుకోము. మనస్సుకు కంట్రోలు వస్తేగాని దానికి లోచూపు కలుగదు. లోచూపు కలిగితేగాని దానికి నిజమైన ఎడ్యుకేషన్ ప్రారంభంకాదు. నీకు అనేక తలంపులు ఉన్నాయి. వాటికి అడుగున ఒకమూలతలంపు ఉంది. దేహం నేను అనేది మూలతలంపు. దానిని ఉపసంహరించు, ఉపసంహరించు ఎంతవరకు ఉపసంహరించాలి అంటే అది దానిమూలమైన హృదయంలోనికి వెళ్ళేవరకు దానిని ఉపసంహరించు. ఇక్కడనుండి మద్రాసు 300 కి॥మీ॥ అనుకోండి. 100 కి॥మీ॥ ప్రయాణంచేస్తే మద్రాసు రాదు. 299 కి॥మీ॥ ప్రయాణం చేసిన మద్రాసురాదు. 300 కి॥మీ॥ ప్రయాణం చేయవలసిందే. కొంతదూరం ప్రయాణంచేసి ఇంకా మద్రాసు రాలేదు అని విసుగుచెంది వెనుకకు తిరిగి వచ్చేస్తే అక్కడ మద్రాసు లేదు అనికాదు. అలాగే సత్యం నీ హృదయంలో ఉంది. అది ఎంత లోతులలోఉందో అంతవరకు నీ మనస్సును ఉపసంహరించవలసిందే. ఇందులో రాజీలేదు.

భగవంతుడు మీకు ఇచ్చిన అవకాశములను సత్యానుభవం పొందటానికి ఉపయోగించుకోవాలి. సత్యానుభవం పొందటమే మీధ్యేయం అది మిస్ అవ్వవద్దు. నీవు సత్యాన్వేషణలో ఉంటే ఆ టైములో నీ దేహం మరణించినా కొత్తదేహం ఎక్కడ ఇస్తాడు అంటే నీవు ఎక్కడ జన్మిస్తే ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి వస్తావో చూసి అటువంటిచోట నీకు దేహాన్ని ఇస్తాను అని భగవంతుడు చెపుతున్నాడు కాని మనకు భగవంతుడు చెప్పిన మాటలమీద విశ్వాసంలేదు. మీరు పని చేసుకోండి. సోమరితనంగా ఉండవద్దు. మీరు చేసే ప్రక్రియ

ఎలా ఉండాలంటే మీరు చేసే పని అజ్ఞానంలోనుండి విడుదల పొందటానికి సహకరించాలి. నీవు చేస్తున్న పనివల్ల నీ దేహబుద్ధినుండి విడుదల పొందాలి. అది యోగం. మీరు ఏకాంతంగా కూర్చోండి. ఊపిరి పీల్చుకోవటం, వదలటం మనస్సుతో చూస్తూ ఉండండి. మీ మనస్సు నిర్మలంగాఉంటే, మీకు మంచి తలంపులు వస్తూఉంటే గాలి నెమ్మదిగా లోపలకు వెళుతుంది, నెమ్మదిగా బయటకు వస్తుంది. నీకు చెడు తలంపులు వస్తున్నాయి అనుకో, నీకు ఉద్రేకం వచ్చింది అనుకో వెంటనే గాలి బుసకొట్టినట్లుగా వేగంగా లోపలకు, బయటకు వస్తుంది. ఇది నీకు అర్థమయితే చెడు తలంపులు వస్తున్నాయో, మంచితలంపులు వస్తున్నాయో నీకు తెలుస్తుంది. చెడుతలంపులు వస్తూఉంటే వాటిని తొలగించుకోవటానికి ప్రయత్నంచెయ్యి. నీలో ఏదైనా చెడ్డఉన్నా నాలో ఈ చెడ్డఉంది, ఈ చెడ్డఉంది అని చాదస్తంగా అనుకోవద్దు. చెడు ఉన్నప్పుడుకూడా నీవు నిర్మలుడవే, నీవు చైతన్య స్వరూపుడవే కాని నీలోఉన్న చెడ్డవలన అది నీకు అందటంలేదు. దానిని తొలగించుకోవటానికి ప్రయత్నం చెయ్యి. అదే సాధన. మనం నిజంగా సాధన చేస్తూఉంటే మన మొఖంలో, మనచేతలో, మన ప్రవర్తనలో వికాశం తెలుస్తూ ఉంటుంది. కొండమీద దీపంపెట్టి ఎవరికీ కనబడకూడదు అంటే ఎలా సాధ్యం, అది కనిపిస్తూనే ఉంటుంది. మీకు బ్రహ్మానుభవం కలిగినప్పుడు మీనుండి జ్ఞానతరంగాలు, శాంతితరంగాలు, కాంతితరంగాలు భూమిమీదకు వ్యాపిస్తాయి.

దేహాన్ని, మనస్సును మేగ్జిమమ్ ఉపయోగించుకొని ఏదో మార్గంద్వారాప్రయాణించి దేహము నేనుఅనే బుద్ధిలోనుండి విడుదలపొందాలి. నీవు కాని దేహంతో తాదాప్యం పొందుతున్నావు. నీవు కానిదానితో తాదాప్యం పొందుతున్నంతకాలం నీవు ఎవరో నీకు తెలియదు. నీవు ఏదైతేకాదో దానిలోనుండి విడుదల పొందటానికి విచారణ అవసరం. విచారణద్వారా దానిలోనుండి విడుదలపొందితే నీవు ఏదైతే అవునో అది అంటే ఆత్మ తనంతట తానుగా నీకు వ్యక్తమవుతుంది. దేహగతమైన నేను ఎక్కడైతే అణిగిపోయిందో అక్కడే నిజమైన నేను నీకు వ్యక్తమవుతుంది. ఈ దేహమే నేను, దేహమే సత్యం అని నీవు అనుకోవచ్చు. అలా అనుకొన్నంత మాత్రంచేత అది నీవుకాదు. ఆ దేహం ఏదోరోజు నిన్ను విడిచిపెట్టేస్తుంది. మనదైనందిన జీవితంలో ఆడంబరం తగ్గాలి. లోపల ఉన్న వస్తువుకు ఆడంబరంలేదు. మన జీవితవిధానంలో ఆడంబరం ఉన్నప్పుడు అది మనకు అనుభవంలోనికిరాదు. వారిలో ఆ పొరపాటుఉంది, ఈ పొరపాటు ఉంది అని చూసేబదులు నీలోఉన్న పొరపాటును చూసుకొని దానిని సరిచేసుకొంటే నువ్వు బాగుపడతావు.

20-07-2001

# భోగి ఈ లోకానికి అశాంతిని పంచిపెడతాడు యోగి ఈ లోకానికి శాంతిని పంచిపెడతాడు

(సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 31-5-2001, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ధ్యానం చేసేటప్పుడు ఏ ఆసనంలో కూర్చోమంటారు అని అడుగుతున్నారు, ఒకే వస్తువుమీద మనస్సును నిలబెట్టి ఉంచితే దానిని ధ్యానం అంటారు. ధ్యాన్యం చేసేటప్పుడు మీరు సుఖాసనంలో కూర్చోండి అంటున్నారు భగవాన్. నీకు ఏ ఆసనంలో కూర్చొంటే సుఖంగా ఉందో అలా కూర్చోండి. అదే సుఖాసనం. మోకాళ్ళ నొప్పి ఉన్నవారికి పద్మాసనం ఎలా కుదురుతుంది? కుదరదు, భగవాన్ సిద్ధాంతం ఏమిటిఅంటే మీ బాధలు ఏవో మీకుఉన్నాయి సాధన పేరుమీద గురువు ఆ బాధలు పెంచకూడదు, తగ్గించాలి. మీకు ఏ పద్ధతి అలవాటుగా ఉంటే, సులువుగా ఉంటే ఆ పద్ధతిలో కూర్చోండి కాని మనస్సు ధ్యేయ వస్తువుమీద నిలబడాలి అది ముఖ్యం. మీ ఇష్టదేవతమీద మనస్సు నిలబడాలి అది ముఖ్యంగాని మీరు ఎలా కూర్చొన్నారు అనేది ముఖ్యంకాదు. మోక్షానుభవం పొందటానికి పనికివచ్చే కర్మేకాకుండా మామూలుగా లౌకికకర్మలుకూడా ఆ పనిచేస్తే ఈ ఫలితం వస్తుందిఅని వేదంలో చెప్పారుకదా అని భగవాన్‌ను అడిగితే ఆ పనులు నిన్ను చేయమని వేదంలో ప్రోత్సహించలేదు. ఆ పనులుచేస్తే ఏ ఫలితం వస్తుందో వేదంలో చెప్పారు. కామ్యకర్మలను వేదంలో ప్రోత్సహించలేదు. వేదంలోను, గీతలోను చెప్పింది నిష్కామకర్మ. నీకు ఆత్మానుభవం కలగటం కోసం సహకరించే పనే పని, మిగతాదంతా వేస్టు అన్నారు. నీ హృదయంలోఉన్న వస్తువును తెలుసుకోవటానికి నీమాట, నీచేత, నీతలంపు సహకరించాలి. దానికి సహకరించకపోతే నీ కాలం, శక్తి వృధా అవుతుంది. హృదయంలో మనస్సును నిలబెట్టి ఉంచితే ప్రశాంతంగా ఉంటుంది అది చేయలేకపోతే ఇష్టదేవతను ఆరాధించుకో. హృదయం అంటే ఏమిటి? నీకు నేను అనే తలంపుఉంది. అది ఎక్కడో బయటనుండి రావటంలేదు, నీ లోపలనుండే వస్తోంది. నేను అనేతలంపు నీ లోపల ఎక్కడ పుట్టివస్తోందో అదే ఆధ్యాత్మిక హృదయం. అది అనుభవైక వేద్యం. అనుభవంలోనికి వచ్చే విషయాలను అనుభవంద్వారానే తెలుసుకోవాలిగాని ఊహించి తెలుసుకోలేము. నీ లోపలఉన్న బ్రహ్మం నీ మాటకు, మనస్సుకు అందదు. ఎక్కడైతే మాటఅణిగిందో, ఎక్కడైతే మనస్సుఅణిగిందో అక్కడ అది వ్యక్తమవుతుందిగాని దానిని నీ మనస్సుతో పట్టుకోలేవు. అందుచేత నీ మనస్సును హృదయంలో నిలబెట్టు.

నీ మాటలోగాని, చేతలోగాని, తలంపులోగాని అహంభావన కలగజేసుకోకుండా చూసుకోవాలి. అహంభావన కలగజేసుకొంటే మన స్వరూపానికి దూరమవుతాము, సుఖానికి, శాంతికి దూరమవుతాము. భోగి ఈ లోకానికి అశాంతిని, దుఃఖాన్ని పంచిపెడతాడు. యోగి

ఈ లోకానికి సుఖాన్ని, శాంతిని పంచిపెడతాడు. ఈ లోకం నిజంఅని మనం నమ్ముతున్నాము. భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అని మనకు నమ్మకం కుదరటంలేదు. ఈ లోకం నిజంక్రింద కనిపిస్తున్నంతకాలం మీకు తలంపులు వస్తూనే ఉంటాయి. మీ హృదయంలోఉన్న సద్వస్తువు మీకు అనుభవంలోనికి వచ్చేవరకు ఏదో తలంపు మిమ్మల్ని వెంటాడుతూనే ఉంటుంది. మూలతలంపు మూలం ఎక్కడ ఉంది అనేది ముఖ్యంకాదు, అది మీకు తెలియాలి అదిముఖ్యం. మూలతలంపు దాని మూలాన్ని చూస్తేగాని అది నశించదు. మూలతలంపు నశించకపోతే దేహంవచ్చేస్తుంది, లోకంవచ్చేస్తుంది, దేవతలువచ్చేస్తారు అందరూ వచ్చేస్తారు. మూలతలంపుఉంటే అంతాఉంది అదిలేకపోతే ఏదీలేదు. మూలతలంపును దానిమూలంలోనికి పంపటానికి నీవుచేస్తున్న ప్రయత్నమే సాధన. హృదయాభిముఖంగా మీ మనస్సు ప్రయాణం చేస్తూఉంటే బాహ్యఆకర్షణలు తగ్గిపోతాయి. ఇప్పుడు ఎవరైనా మిమ్మల్ని పొగిడితే సంతోషం వస్తుంది. అది ఒకరకమైన వికారం. ఎవరైనా విమర్శిస్తే దుఃఖం వస్తుంది. అది ఒకరకమైన వికారం. పొంగు ఒకతలంపు, కృంగిపోవటం ఒకతలంపు. కాని నీ మనస్సు హృదయాభిముఖంగా ప్రయాణంచేసి హృదయంలో నిలబడితే "ఎవ్విరీతింగ్ ఈజ్ డివైన్" అన్నారు. అప్పుడు ఎవరైనా విమర్శించినా, పొగిడినా అదీ డివినిటీ, ఇదీ డివినిటీ క్రిందే మనకుఅనిపిస్తుంది, నీ మనస్సు హృదయంలో నిలబడి ఉన్నప్పుడు అదృష్టం వెంటాడుతూఉన్నా, దురదృష్టం వెంటాడుతూఉన్నాకూడా నీకు ఏమీ అనిపించదు. అహంకారం ఉన్నవాడికి, దేహాభిమానం ఉన్నవాడికి అదృష్టం, దురదృష్టం. అహంకారం లేనివాడికి అదృష్టంలేదు, దురదృష్టంలేదు, గీతలో భగవంతుడు కర్మయోగాన్ని ఎక్కువ ప్రోత్సహించాడుకదా అని ఒకరు భగవాన్‌ను అడుగుతున్నారు. కర్మయోగానికి ఎక్కువ ప్రాముఖ్యత ఇచ్చాడు అని ప్రశ్నించేవాడి అభిప్రాయం. కర్మయోగి ఏ స్థితినిపొందుతాడో, జ్ఞానయోగి అదేస్థితిని పొందుతాడు ఇందులో సందేహంలేదు. భక్తి కర్మయోగానికి అవసరమే, జ్ఞానయోగానికి అవసరమే. అసలు డివోషన్ లేకుండా డెడికేషన్ రాదు. భక్తివల్లనే అంకితభావం కలుగుతుంది. మనం ఏ సబ్జక్టులో కృషి చేస్తున్నామో దాని ప్రాముఖ్యత తెలిస్తే, అది సమాజానికి ఎంతవరకు ఉపయోగపడుతుంది, మన చైతన్యస్థాయి పెరగటానికి ఎంతవరకు ఉపయోగపడుతుంది అని ఒక అవగాహనఉంటే దానిమీద భక్తిఉంటే అప్పుడు దానిమీద అంకితభావం వస్తుంది. నీ జీవితంలో అనేక సంఘటనలు జరుగుతూ ఉంటాయి. ఒకో సంఘటనద్వారా ఒకో అనుభవం నీకు వస్తుంది. ఆ సంఘటనలద్వారా నీవు పాఠాలు నేర్చుకోవాలి. నీకు పాఠాలు నేర్పటానికే ఆ సంఘటనలను ఈశ్వరుడు క్రియేట్ చేస్తాడు. మన అహంకారానికి ఏది ఇష్టామో ఆ పని మనంచేస్తాము. భగవంతుడు ఏమిచెపుతున్నాడు అంటే నీ ఇష్టాయిష్టములను ఒకప్రక్కనపెట్టి నాకు ఇష్టమైన పనిని నువ్వుచెయ్యి అని చెపుతున్నాడు.

మయ్యేవ మన ఆధత్స్వ మయి బుద్ధిం నివేశయ
నివసిష్యసి మయ్యేవ అత ఊర్ధ్వం న సంశయః

నీ మనస్సును, బుద్ధిని నాయందే స్థిరంగా నిలబెట్టి ఉంచితే అప్పుడు నీవు ఎక్కడ ఉంటావు అంటే నాయందే ఉంటావు అంటే చైతన్యంలో ఉంటావు. ఇందులో సందేహంలేదు అని భగవంతుడు చెపుతున్నాడు.

తెలివితక్కువవారు మనస్సును ఎలా నిగ్రహించుకోవాలి, మనస్సును ఎలా నిగ్రహించుకోవాలి అని మనస్సుచుట్టూ తిరుగుతూ దానికి చాకిరి చేస్తూఉంటారు. తెలివైనవారు ఏమిచేస్తారు అంటే మనస్సు గొడవ వదిలేసి కృష్ణా కృష్ణా అనుకొంటూ ఉంటారు. అప్పుడు వారికి తెలియకుండానే వారిమనస్సు కంట్రోలులోనికి వచ్చేస్తుంది. నేను అందరి హృదయాలలో అంతర్యామిగాఉండి, వారివారి దేహప్రారబ్దాన్నిబట్టి వారిని ఆడిస్తున్నాను. మీరు ఏమిచేస్తున్నారు అంటే నన్ను పూర్తిగా మర్చిపోయి ఈ మనస్సును ఎలా నిగ్రహించుకోవాలి అనుకొంటున్నారు. నన్ను నిరంతరం స్మరించటంవలన మీ మనస్సు కంట్రోలులోనికి వచ్చేస్తుంది. మీరు డైరెక్టుగా మనస్సును పేస్‌చేస్తే మనస్సును జయించటం కష్టం. మీకు బాగుచేసుకొనే శక్తిఉంటే బాగుచేసుకోండి లేకపోతే మీ మనస్సును నాకు ఇచ్చేయండి అని భగవంతుడు చెపుతున్నాడు. నాపట్ల భక్తికలిగి ఉన్నావు అనుకో, ప్రేమకలిగిఉన్నావు అనుకో నీ మనస్సులో ఉన్న వాసనలు వాటిఅంతట అవేరాలిపోతాయి. నాపట్ల నీకు ధ్యాసకలిగితే విషయాలపట్ల ధ్యాస దానికదేపోతుంది. నేను చెప్పిన మాటయందు నీకు ప్రమాణబుద్ధి కలగదు అనుకో, సందేహం పెట్టుకొంటావు అనుకో నీవు పాడైపోతావు అని భగవంతుడు అంటున్నాడు. డబ్బు సంపాదన కోసం ఎంత కష్టపడుతున్నారో, చదువుకోసం ఎంత కష్టపడుతున్నారో భగవంతుడు అనుగ్రహం సంపాదించటానికి అంత కష్టపడితే మనకు ముక్తి కలుగుతుంది. పని నెరవేర్చుకోవటం కోసం ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నారో అలాగ ఈశ్వరానుగ్రహం పొందటానికి ఎన్ని ఉపాయాలు ఉంటే అన్ని ఉపాయాలు ప్రయోగించి ఈశ్వరానుగ్రహాన్ని పొందండి.

నాకు అందరికి ఉపకారం చేయాలని ఉంది అని ఒకరు భగవాన్‌ను అడుగుతున్నారు. ఎంతసేపు ఇతరులకు ఉపకారం చేస్తాను అంటున్నావు. నీ లోపల సత్యవస్తువు ఉంది, చైతన్యం ఉంది ముందు దానిని తెలుసుకో. దానిని తెలుసుకొన్నాక ఇతరులు ఎవరైనాకనబడితే వారికి సహాయం చెయ్యవచ్చు ముందు దానిని తెలుసుకో అంటున్నారు భగవాన్. చైతన్యానుభవం పొందినవాడికి అసలు ఇతరులే ఉండరు. వాడికి ఇతరులక్రింద కనిపించరు, తానుక్రింద కనిపిస్తారు. తానుక్రింద కనిపించినప్పుడు ఇంక ఉపకారంచేయటం ఏముంది. ఇతరులకు సహాయం చేస్తాను అనేది ఎవరు? అది నీ అహంభావనే. సంస్కరణ అనేది నీతోటే ప్రారంభించు. నువ్వు ఎవరిని సంస్కరిస్తావు నిన్ను నీవుసంస్కరించుకోకుండా ఎవరిని

సంస్కరిస్తావు. నీకుఆత్మానుభవం కలుగకుండా ఎవరిని ఉద్ధరిస్తావు, ఉద్ధరించటానికి నీదగ్గర ఏమైనా ఉంటేకదా. నీ దగ్గర ఏదైనాఉంటే అది ఇతరులకు ఇవ్వగలవు నీ దగ్గరే లేనప్పడు ఇతరులకు ఏమి ఇస్తావు. నీ మనస్సు ఎంత నిజమో ఈ ఉపకారములు అంతే నిజం. సబ్జక్టు ముందు అర్థం చేసుకో. నీ లోపల ఒక సత్యంఉంది. నీవు సత్యాన్వేషణ ప్రారంభిస్తే, నీ సత్యాన్వేషణ నిజమయితే ఎక్కడివి అక్కడ అన్నీ చక్కబడిపోతాయి. నువ్వు ఇతరులకు ఉపకారం చేస్తాను అంటున్నావు కదా అప్పడునీ కోరికతో సంబంధం లేకుండా ఇతరులకు ఉపకారం జరిగిపోతుంది. అందువలన ముందు నీవు బాగుపడు అనిచెపుతున్నారు. నేను బాగుపడ్డాను అనుకోండి దానివలన ఇతరులకు లాభం ఏమిటి అని అడుగుతున్నాడు. ఎవడైతే బ్రహ్మానుభవం పొందాడోవాడిద్వారా జరిగే ఉపకారం ఇతరులు ఎవరిద్వారా జరుగదు. అందుచేత ముందు నీవు బ్రహ్మానుభవం పొందు.

పూర్వపుణ్యాన్నిబట్టి నీకు సత్పురుషుల సహవాసం దొరికింది అనుకో వారిద్వారాపూజాఫలం, జపఫలం, ధ్యానఫలం, కర్మఫలం అన్నీ వచ్చేస్తాయి. నిన్ను ఉద్ధరించాలి అనివారు అనుకోరు వారి సమక్షంలో నీవు ఉద్ధరింపబడతావు. నీవు 100 సంవత్సరాలు జీవించావు అనుకో అందులో ఒక్క సంవత్సరం భగవదనుభవం కోసం ప్రయత్నం చేస్తావు అనుకో మిగతా 99 సంవత్సరములు భగవదనుభవం కోసం కృషి చేయలేదు అనుకో ఆ 99 సంవత్సరాలు వృథా అయ్యిందని చనిపోయాక నీకు తెలుస్తుంది అని చెపుతారు. అహంకారంలో ఉన్నకారం విడిచిపెడితే, దేహబుద్ధిని విడిచిపెడితే ఇతరులకు మహోపకారం అందుతుంది. ఇందులో సందేహం లేదు. ఈ లోకం నీదీకాదు, నాదీకాదు. ఈ లోకానికి ఒక యజమాని ఉన్నాడు. ఈ లోకాన్ని ఎలా చూసుకోవాలో నీకంటే ఆయనకు బాగా తెలుసు. నీవు ఈ లోకంలోనికి రాకముందు ఈ లోకం ఉంది, నీ శరీరం పోయాకకూడా ఈ లోకం ఉంటుంది. మనం జన్మించకముందు ఈ లోకాన్ని ఎవడైతే చూసాడో, మన దేహం మరణించాకకూడా ఆయనే ఈ లోకాన్ని చూసుకొంటాడు. నీవు మధ్యలోవచ్చి మధ్యలోవెళ్ళిపోతున్నావు. ఈ లోకం గురించి నీకు ఆందోళన ఎందుకు అంటున్నారు. లోకవాసన ఎక్కువగా ఉన్నప్పడు ఇటువంటి గొడవలు వస్తాయి. లోకవాసన ఎక్కువగాఉంటే భగవంతుడికి దూరమవుతాము. మీరు ఏ బుద్ధితో అయితే విషయాలను చింతిస్తున్నారో అది స్టాప్‌చేసి ఆ బుద్ధిని నాకిస్తే మీరు నాయందే ఉంటారు అంటే మీరుచైతన్యంలోనే ఉంటారు. ఇందులో సంశయం అక్కరలేదు. భగవంతుడు చెప్పిన మాటలను సందేహిస్తూఉంటే దానికి మనలోని దోషములు కారణం. మనలోఉన్న దోషాలు భగవంతుడు చెప్పిన మాటలను అంగీకరింపచేయనివ్వవు. నిరంతరం భగవంతుడిని స్మరించటంవలన ఆయనను శరణువేడుకోవటం వలన ఆ దోషాలనుండి నిన్ను విడుదల చేస్తాడు.



## జిన్నూరు శ్రీ రమణ క్షేత్రంలో గురుపూర్ణిమ మహోత్సవం

జూలై 5వ తేదీ గురువారం గురుపూర్ణిమ సందర్భంగా భక్తులు అశేష సంఖ్యలో ఉదయం 6 గం॥లకే సద్గురు దర్శనం కోసం ఆయన గృహంవద్ద బారులుతీర్చి ఉన్నారు. శ్రీ రమణ క్షేత్రం ప్రెసిడెంట్ శ్రీ పెన్మెత్స సత్యనారాయణరాజుగారు వైజాగ్‌నుండి కుటుంబ సమేతంగావచ్చి సద్గురువును దర్శించి ఆయన ఆదేశానుసారం 8 గం॥లకు శ్రీ రమణక్షేత్రం చేరుకుని అక్కడ భగవాన్ శ్రీ రమణమహర్షికు పూజాకార్యక్రమాలు నిర్వహించారు. సద్గురు దర్శనం ఉదయం 6 గం॥ నుండి 12 గం॥ల వరకు ఆయన గృహంవద్ద జరిగింది. శ్రీ రమణక్షేత్రం కమిటీ కార్యదర్శి శ్రీ **P.S.** రామరాజువారి ఆహ్వానం మేరకు సద్గురు శ్రీ నాన్నగారు మధ్యాహ్నం 1 గం॥కు రమణక్షేత్రం విచ్చేసినప్పుడు మంగళవాయిద్యాలతో వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగత సత్కారాలు చేసినారు. వేలాది భక్తుల సమక్షంలో 2 గం॥లకు శ్రీ **P.S.N.** రాజు కుటుంబ సభ్యులు సద్గురు శ్రీ నాన్నగారికి పాదపూజచేసి ఘనంగా సత్కరించారు. సభాప్రారంభంలో శ్రీ **P.S.N.** రాజుగారు గురుపూర్ణిమ విశిష్టత గురించి చెబుతూ, చివరిశ్వాసవరకు మీపట్ల ప్రేమ చెదిరిపోకుండా అనుగ్రహించి, మాకు అండగా ఉంటూ ఆధ్యాత్మిక అభివృద్ధికి సహకరించాలి అని భక్తులందరి తరుపున సద్గురు శ్రీ నాన్నగారిని అర్థించారు. అనంతరం శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు జరిగినవి. ఈ కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలలనుండి అధికసంఖ్యలో భక్తులు హాజరైనారు. ఈ ఆధ్యాత్మికసభ ఆహ్లాదకరమైన వాతావరణంలో జరిగి సద్గురు దర్శనంతోను, ప్రవచనంతోను భక్తులు పరవశించారు.



శ్రీ రమణాశ్రమం, తిరువన్నామలై



ఆంధ్రాశ్రమం, తిరువన్నామలై



శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు

**REGISTERED NEWS PAPER** RNI NO. APTEL/1999/1667-POSTAL REGN.NO. AP/VJA/32/5/2000

To

**A. Lakshmi**
Plot No. 150, Rao & Raju Colony
Banjara Hills, Road No. 2
HYDERABAD - 500 034

*If undelivered please return to :*

**RAMANA BHASKARA**
SRI RAMANA KSHETRAM,
**JINNURU - 534 265.** W.G. Dt. A.P.

Editor, Printer, Publisher : **P.S. RAMA RAJU**
Lakshmi Modern Rice Mill, Ullamparru, PALAKOL - 534 260. W.G. Dt. ☎ : 08814-24589, 24689
Printed at : **SHRIRAM GRAPHICS**, Bank Street, PALAKOL - 534 260. W.G. Dt. ☎ : 22438, 24278